కథ

# కుక్క పాట్లు

ముద్దుముద్దుగా ఆడుకొంటున్న లల్లీని చూడగానే రాజాకు తన చిన్ననాటి రోజులు జ్ఞాపకం వచ్చాయి.

తమ ఇంట్లో కుక్కపిల్లను తెచ్చి పెంచుకోవాలని రాజాకు ఆశగా వుండేది. తెల్లగా, బొద్దుగా వుండే బొచ్చు కుక్క మన దగ్గరకొచ్చి తుళ్లుతూ ఆడుకొంటుంటే ఎంత బావుంటుంది. తన స్నేహితులు చాలామంది ఇళ్లల్లో కుక్కపిల్లలుండేవి. తన ఆశ మాత్రం తీరే అవకాశం కనిపించలేదు.

"అమ్మా! మనం కూడా కుక్కపిల్లను తెచ్చి పెంచుకుందామే" అని అడిగిన రోజున అమ్మ తనను ఎంత కంపరంగా చూసిందనీ.

"ఛీ వెధవా! నీకీ బుద్ధులు ఎలా వచ్చాయిరా! ఎవరో బుద్ధిలేనివాళ్లు పెంచుకుంటూంటే చూసి నీకీ బుద్ధి పుట్టిందన్నమాట! వెళ్లు. మీ నాన్నగారితో పోయి చెప్పు ఈ మాట. నిన్ను కుక్కను కొట్టినట్టు కొట్టి తరుముతారు" అని చీదరించుకొంది.

నాన్నగారి విషయం తనకు తెలియనిదా ఏమిటి? ఆయనకు కుక్కల్నీ పిల్లుల్నీ పెంచుకోవడం అస్సలు గిట్టదు. వీధిలో కుక్కలైనా తమ ఇంటి గేటు ముందు తచ్చాడుతుంటే దాన్ని వీధి చివరిదాకా తరిమికొట్టేదాకా వదిలేవారు కాదు.

'కుక్క విశ్వాసం గల జంతువు' అని ఎవరైనా చెబితే ఆయన వొప్పుకొనేవారు కారు. తనకు తెలిసి ఎంతమంది కుక్కలను పెంచి ఎన్నెన్ని బాధలు పడ్డారో, ఎన్ని ఇళ్లల్లో ముద్దుగా పెరిగిన కుక్కలే ఒకానొక దుర్ముహూర్తాన ఇంటి యజమానినో, ఆయనకు సంబంధించినవారినో ఎలా కరిచిందో చెప్పి ఎదుటివారి నోరు మూయించేవారు.

ఆయన పనిచేసింది తాశీల్దారుగానే కానీ, ఆయనకు కవిత్వం రాయాలని చాల ఉత్సాహంగా వుండేది. ఆ క్రమంలో కుక్కల విశ్వాసఘాతుకతను గురించి కూడా ఆయన కొన్ని పద్యాలు రాశారు. అన్నీ గుర్తులేవు గానీ ఒక్క పద్యం మాత్రం రాజాకు ఇప్పటికీ బాగా గుర్తు.

'కుక్కను పెంచుట నేరము
మక్కువతో కుక్కదెబ్బ మాలిమి సేయన్
ఒక్క దినమ్మున మరి యా
కుక్కయె పిచ్చెక్కి నీదు పిక్కను నీల్చునో

అని కుక్క ఎంత భయంకరమైనదో చెప్పి, అసలు దాన్ని పెంచడం చట్టరీత్యా నేరంగా ప్రకటించాలనీ, అలాంటి ఆలోచనయే ప్రభుత్వానికీ రావడం లేదనీ వాపోయేవారు.

అటువంటి మనిషితో పోయి 'మనం కుక్కను పెంచుకుందాం నాన్నా' అని అడిగితే దాన్ని తరిమినట్టు తనను తరుముతారని తెలుసు. తల్లిదండ్రులకు ఇష్టం లేదని ఆ ఆశను అప్పట్లో చంపుకున్నాడు కానీ రాజా పెరిగేకొద్దీ ఆ ఆశ కూడా పెరుగుతూనే వచ్చింది. చివరికి తల్లిదండ్రులు చనిపోయాక, తాను పెళ్లి చేసుకున్నాక భార్యతో మొదటిసారిగా మనసు విప్పి మాట్లాడుకుంటున్నప్పుడు, ఇద్దరూ వారి వారి ఇష్టాయిష్టాలు అడిగి తెలుసుకొంటున్నప్పుడు చెప్పాడు.

"నాకు కుక్కను పెంచుకోవాలని చిన్నప్పటి నుంచీ కూడా ఇష్టంగా వుండేది. మా అమ్మా నాన్నా వున్నప్పుడు అది కుదరలేదు. ఇప్పటికైనా మనం ఒక అందమైన కుక్కపిల్లను తెచ్చి పెంచుకోవాలి."

జానకి రాజా వైపు చీదరగా చూసింది కానీ రాజా అదేమీ గమనించలేదు.

"నాక్కూడా ఒక ఆశ వుందండీ! ఎప్పటికైనా ఒక పందిపిల్లను తెచ్చి మన బిడ్డలాగా పెంచుకోవాలని. మీ ఇంట్లోలాగే మా ఇంట్లోనూ వొప్పుకోలేదు. పత్రికల్లో చదివాను. అదేదో దేశంలో ఒకామె తాను పెంచుకొంటున్న పందిపిల్లను, పిల్ల అంటే చిన్నది కాదనుకోండి చాలా పెద్దది, తనతో పాటే తన మంచం మీద పడుకోబెట్టుకొని ముద్దు చేస్తున్నట్టు ఫోటో వేశారు. మీరు కుక్కపిల్లను కొని తెచ్చేటప్పుడు ఒక పందిపిల్లను కూడా కొనుక్కురండి" అంది జానకి.

ఆ మాటల్లో వెటకారాన్ని గుర్తించని రాజా హడలిపోయి వూరుకున్నాడు.

ఆ తరువాత కూడా జానకి దగ్గర ఆ ప్రస్తావన తేలేదు.

* * *

ఇన్నేళ్లకు కొడుకు పుట్టి వాడికి ఏడేళ్లు వచ్చాక రాజాకు కుక్కను పెంచుకొనే అవకాశం వచ్చింది.

ఆర్.వి.చలపతి

బాబు సెకండ్ స్టాండర్డ్ చదువుతున్నాడు. వాడి స్నేహితుని ఇంట్లో కుక్క ఒకటి పిల్లలను పెడితే అందులో ఒకటి తెచ్చుకుందామని మారాం చేసి, తన స్నేహితుని తల్లిదండ్రుల అనుమతి తీసుకుని, రాజాను స్వయంగా తీసుకువెళ్లి ఆ కుక్కపిల్లను తెచ్చుకున్నాడు. దానికి ఏం పేరు పెడదామని తండ్రీకొడుకులు దీర్ఘంగా ఆలోచించి, 'లల్లీ' అని నామకరణం చేశారు. కొద్ది కొద్దిగా ఆ కుక్కపిల్లను లల్లీ అని పిలవగానే గుర్తించేలా అలవాటు చేశారు.

లల్లీ పెరిగేకొద్దీ దాని అట్టహాసాలు ఎక్కువై భరించలేకపోయిన ఆ ప్రక్కనే వుంటున్న ఇంటి ఓనరు ఆ మాట చెప్పకుండా, ఇంటికి మరామత్తులూ అవీ చేయాల్సి వుంది కాబట్టి రాజాను ఇల్లు ఖాళీ చేయాల్సిందిగా కోరాడు.

రాజా ఒక ప్రభుత్వ కార్యాలయంలో పని చేస్తున్నాడు, సీనియర్ క్లర్కుగా. అదే ఆఫీసులో తన సెక్షన్‌లోనే అటెండర్‌గా పని చేస్తున్న సీతారాంకు ఒక స్వంత ఇల్లుంది. రెండు వాటాలున్న ఆ ఇంట్లో ఒక వాటా ఖాళీగా వుండటంతో దాన్ని అద్దెకు తీసుకొని ఆ ఇంటికి మకాం మార్చాడు రాజా.

రెండు వాటాలున్నా దానివలన పెద్ద ఇబ్బంది ఏమీ లేదు. కాంపౌండు ఒకటే అయినా రెండు ఇళ్లు ప్రక్కప్రక్కనే వున్నట్టు సెపరేట్‌గా వుంది. తాము అంతకుముందు వున్న ఇంటికన్నా వరండా అదీ బాగా విశాలంగా వుండటంతో అందరికన్నా లల్లీకి ఆ ఇల్లు బాగా నచ్చింది. అది పరుగెత్తడానికి, ఆడుకోవడానికి కావలసినంత స్థలం వుంది. దాంతో లల్లీని అదుపు చేయడం కొంచెం కష్టంగానే వుంది.

"లల్లీ! వీధి వైపు వెళ్లావంటే కాళ్లు విరగ్గొడతాను" అనీ, "ఈ లల్లీకి పెత్తనాలు ఎక్కువయ్యాయి" అనీ బాబు అరుస్తూంటే, "లల్లీ డార్లింగ్! చెప్పిన మాట వినాలి సుమా!" అని రాజా బుజ్జగిస్తూండేవాడు.

ఇక ఈ తండ్రీ కొడుకులు పంతం పట్టి కుక్కపిల్లను తెచ్చి ఇంట్లో పెట్టారన్న అక్కసుతో "లల్లీ అట లల్లీ! నా ప్రాణాలకు దయ్యంలా దాపురిం

చింది" అని కసిదీరా తిడుతూండేది జానకి.

ఒకరోజు ప్రక్కవాటాలో కాపురముంటున్న సుధాకర్ రాజా కోసం వచ్చాడు.

"రండి. ఏం కావాలి?" అని అడిగాడు రాజా మర్యాదగానే. వాళ్లిద్దరూ మాట్లాడుకోవడం అదే మొదటిసారి.

"మా ఆవిడ ఒకటే ఏడుస్తోంది" అన్నాడతను.

రాజాకు అర్థం కాలేదు. అతని భార్య ఏడిస్తే తనేం చేయగలడు?

మొహం ప్రశ్నార్థకంగా పెట్టాడు.

"మీరేమో వీధిలో నికి వినిపించేలా 'లల్లీ డార్లింగ్' అని పిలుస్తూంటారు. మీ ఆవిడేమో 'లల్లీ కుక్కా! నా పాలిట దెయ్యమా?' అని తిడుతూ వుంటుంది. ఏం చేయమంటారు ఏడవక? అన్నాడతను కోపంగా.

"మా కుక్కను మేము బుజ్జగిస్తాము. తిట్టుకుంటాము. ఆవిడకెందుకూ?" అన్నాడు రాజా కూడా కోపంగా.

"మా ఆవిడ పేరు లలిత. నేను లల్లీ అనే పిలుస్తూంటాను. మేము ఈ ఇంట్లో నాలుగేళ్లుగా వుంటున్నాము. ఈ వీధిలో అందరికీ ఆవిడ 'లల్లీ'గానే తెలుసు" అన్నాడు సుధాకర్ చురచురా చూస్తూ.

సరిగ్గా ఆ సమయానికి "ఏయ్ లల్లీ దెయ్యమా! హాలంతా ఖరాబు చేశావుగదే శని పట్టినదానా! నేను ఎంత అరుస్తున్నా లక్ష్యపెడుతుందా అది! అంతా ఆయన చేస్తున్న గారాబం. నా ఖర్మ" అని జానకి అరవడం వినిపించింది.

సుధాకర్ మొహం పాలిపోయింది. "చూశారా!" అన్నట్టు చూశాడు రాజా వైపు.

ఏం చెప్పాలో తోచలేదు రాజాకు.

"అయితే ఏం చేయమంటారు?" అన్నాడు సుధాకర్.

"దానికి ఆ పేరు అలవాటు పడటానికి మేము చాల రోజులు శ్రమపడ్డాం. ఇప్పుడు పేరు ఎలా మారుస్తాం!" ఖరాఖండిగా చెప్పాడు రాజా.


"తప్పదు. మేము వీధిలో తలెత్తుకు తిరగాలా! లేదంటే ఒక పని చేయండి. దాన్ని నోటికొచ్చినట్టు తిట్టకండి. మీరు దాన్ని డార్లింగ్ అని పిలవడం మానెయ్యండి. 'జూ జూ' అని పిలిచి అలవాటు చేస్తే అదే దాని పేరు మర్చిపోతుంది" అన్నాడు సుధాకర్.

"కుక్కను తిట్టకుండా మర్యాద చేయవలసిన అవసరం మాకు లేదు. ఇంకా మాట్లాడితే 'లల్లీ గారూ' అని పిలవమంటారు లాగుంది. కావాలంటే మీరు మీ ఆవిడ పేరు మార్చుకోండి లేదా 'జూ జూ' అని పిల్చుకోండి. అభ్యంతరం లేదు" వెటకారంగా అన్నాడు రాజా.


కోపంగా చూశాడు సుధాకర్.

"ఓనరుతో చెప్పి మిమ్మల్ని ఇల్లు ఖాళీ చేయిస్తాను" అని బుసలు కొట్టాడు.

"భేషుగ్గా. మీ చేతనయింది మీరు చేసుకోండి. లల్లీ పేరు మాత్రం మార్చను" అనేసి "లల్లీ








డార్లింగ్!" అని పిలుస్తూ వెళ్లిపోయాడు రాజా.

* * *

"ఏం సార్! మీ ప్రక్కవాటా అతను మిమ్మల్ని ఖాళీ చేయించమంటున్నాడు. ముందు అతడినే ఇల్లు ఖాళీ చేయమని చెప్పాను. వారం రోజుల్లో ఖాళీ చేయిస్తానని ప్రతిజ్ఞ చేసి వెళ్లాడు" అన్నాడు ఆ ఇంటి యజమానీ, తమ ఆఫీసులో అటెండరూ అయిన సీతారాం. అతను రాజా క్రింది ఉద్యోగి కావడం వలన రాజాను కాకా పట్టడంలో ఆశ్చర్యం లేదు. అదే అనుకున్నాడు రాజా. ఎలాగో అలా ఆ సుధాకర్‌గాడి గొడవ వదిలితే సరి అనుకున్నాడు. వారం తిరక్కముందే సుధాకర్ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతూ రాజాను చూసి "ఎవ్రీ డాగ్ విల్ హ్యావ్ హిజ్ డే!" అనేసి చకచకా వెళ్లిపోయాడు. రాజా నవ్వుకున్నాడు.



ఆ తరువాత పది రోజులకే రాజాకు పై అధికారి బదిలీపై వెళ్లిపోవడం, క్రొత్త ఆఫీసరు రావడం జరిగింది. క్రొత్తగా వచ్చినాయన రావడమే కుటుంబంతో సహా వచ్చి, అర్జెంటుగా ఇల్లు కావాలని సుధాకర్ ఖాళీ చేసిన వాటాలో దిగడం జరిగింది.

వాళ్లింట్లోనూ ఒక మగ కుక్కను పెంచుతున్నారు. 'అబ్బ! వాళ్లూ కుక్కను పెంచుతున్నారు కాబట్టి ఏ గొడవా వుండదు' అనుకున్నాడు రాజా.

రెండుమూడు రోజుల పాటు వాళ్లు సామాన్లూ, అవీ సర్దుకోవడంలో బిజీగా వున్నారు. ఈలోగా వాళ్ల కుక్కా, లల్లీ బాగా కలిసిపోయి ఆడుకోవడం మొదలుపెట్టాయి.

ఆరోజు ఉదయం నుండి ఆయన ప్రతిదానికీ "రాజా! మీ పనిమనిషిని మా ఇంట్లో కూడా చేయమని చెప్పవోయ్" అనీ, "రాజా! మీకు పాలు ఎవరు పోస్తారు? మాకూ చెప్పు" అనీ రాజాను మాటిమాటికీ పిలిచి ఏదో ఒకటి చెప్పసాగాడు.

సాయంత్రం వరండాలో జానకితో పాటు కూర్చుని మాట్లాడుతున్నాడు రాజా.

"రాజా!" అన్న పిలుపు విని ఉలిక్కిపడ్డాడు. అది ఆఫీసరుగారి గొంతు కాదు. ఆయన సతీమణి గొంతు. 'ఈవిడ కూడా తనను పేరు పెట్టి పిలుస్తోందేమిటి!' అనుకున్నాడు.

"ఎప్పుడూ ఆ పాడు ఆడకుక్కతో ఆటలేమిటీ! అడ్డమైన సావాసాలు చేశావంటే కాళ్లు విరగ్గొడతాను" అంటూ వుంది ఆవిడ కుక్కను చూస్తూ.

రాజా అవాక్కయ్యాడు.

అంటే వాళ్ల కుక్క పేరు 'రాజా' అన్నమాట! వాళ్లు ఎప్పుడు తనను పిలుస్తారో, ఎప్పుడు కుక్కను పిలుస్తారో తెలియదు కదా!

రాజాకు సుధాకర్ వెళ్లిపోయేముందు చెప్పిన మాట గుర్తు వచ్చింది.

'ఎవ్రీ డాగ్ విల్ హ్యావ్ హిజ్ డే!'

అంటే ప్రతివాడికీ ఏదో ఒకరోజు రాజయోగం వుంటుందనా? లేక ప్రతివాడూ ఒకరోజున ఇలా కుక్కపాట్లు పడాల్సి వస్తుందనా?

☆

## ఆ మాటలకు అర్ధమేంటో?

ఊర్మిళ మంతోద్కర్ దగ్గర పెళ్లి ప్రస్తావన తీసుకొస్తే- 'పెళ్లికొడుకు విషయంలో నాకు అంతగా కోరికలు లేవు. సినిమా హీరోల్లా స్టయిలుగా, కండలు తిరిగిన వస్తాదులా వుండక్కర్లేదు. తెలివైనవాడు, మంచి మనసున్న వాడు అయితే చాలు. అయినా పెళ్లికింకా టైముంది. ప్రస్తుతం నేను జీవితాన్ని ప్రేమిస్తున్నాను' అంటోంది ఊర్మిళ. ఈ మాటల్లోని భావమేమిటో ఊర్మిళాకే తెలియాలి కదా!